క్లుప్తంగా

ప్రభుత్వ విప్‌ను కలిసిన సొసైటీ చైర్మన్



విప్‌తో సొసైటీ చైర్మన్ గంగాధర్

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ దాసరి గంగాధర్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఆదివారం వేములవాడలో కలిశారు. సహకార సంఘాల పాలకవర్గాల గడువును ప్రభుత్వం ఆరు నెలలు పెంచడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్‌ను సన్మానించారు. రైతులకు సేవ చేయడానికి మరిన్ని రోజులు అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు, కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థికి సీఐ అభినందన



విద్యార్థిని సన్మానిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: మండలంలోని యామాపూర్ గ్రామానికి చెందిన అలేటి రక్షిత్ అనే విద్యార్థి జేఈఈ మెయిన్‌లో 98.08 శాతం మార్కులు సాధించడంతో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి ఆదివారం సన్మానించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద విద్యార్థి రక్షిత్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. గ్రామీణ ప్రాంత యువకులు ఉన్నత స్థాయిలో రాణించాలని సీఐ కోరారు.

తారురోడ్డుకు మరమ్మతు



గుంతల్లో చదును చేస్తున్న సిబ్బంది

కథలాపూర్: కోరుట్ల– వేములవాడ రూట్‌లో కథలాపూర్ మండలం పోసానిపేట– తాండ్యాల గ్రామాల మధ్య తారు రోడ్డుపై ఏర్పడిన గుంతలను అధికారులు ఆదివారం పూడ్చి వేయించారు. తారు రోడ్డు పోసి చదును చేయించడంతో సమస్య తీరిందని గ్రామస్తులు పేర్కొన్నారు. మహాశివరాత్రి వేళ కోరుట్ల నుంచి వేములవాడ వెళ్లే భక్తులకు ఇదే రోడ్డు ప్రధానం. రోడ్డును మరమ్మతులు చేయించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయని ప్రజలు అంటున్నారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు

కోరుట్ల: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. పట్టణంలోని పలు కిరాణా, మటన్,చికెన్ దుకాణాలు, బేకరీ, స్వీట్ హౌజుల్లో తనిఖీలు చేసి ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న పలు షాపులకు జరిమానా విధించారు. రూ. 15,500 వరకు జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలె అశోక్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న బాపురెడ్డి

కథలాపూర్: దేశం పచ్చని చెట్లతో కళకళలాడాలంటే ప్రతీ ఒక్కరు మొక్కలు నాటడం అలవర్చుకోవాలని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి కోరారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా కథలాపూర్ మండలం భూషణరావుపేటలో ఆదివారం సహకార సంఘం కార్యాలయం ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. మొక్కలు నాటి వాటిని కాపాడాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొండ ఆంజనేయులు, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఫేర్‌వెల్

కోరుట్ల: పట్టణంలోని సాయి జీనియస్ హైస్కూల్‌లో ఫేర్‌వెల్ పార్టీ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. విద్యార్థుల ఆటా, పాటలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చౌకి రమేష్, ప్రిన్సిపాల్ మధు, శ్రీమధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాయికల్‌లో నాసిరకంగా నిర్మించిన మురికి కాల్వ



కూలుతున్న డ్రైయినేజీ

అస్తవ్యస్తంగా మురికికాలువ నిర్మాణ పనులు

రాయికల్: పట్టణంలోని 9,2 వార్డుల్లో కాంట్రాక్టర్ నిర్మిస్తున్న మురికికాలువ నిర్మాణ పనులు నాసిరకంగా ఉండటంతో పాటు, క్రమపద్ధతిలో నిర్మించకపోవడంతో గృహ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్మించిన మురికికాలువల చుట్టూ మొరం నింపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా మురికి కాలువలపై డ్రంప్ నిర్మాణం చేపట్టకపోవడంతో ఇంటి యజమానులు సంబంధిత కాంట్రాక్టర్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనుల్లో సైతం నాణ్యత లోపిస్తుందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్ ఏఈ, అధికారులు స్పందించి నాసిరకమైన పనులను పర్యవేక్షించి నాణ్యతగా మురికికాలువ నిర్మాణ పనులు చేపట్టేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.



నిర్లక్ష్యంగా వదిలేసిన డ్రైయినేజీ పనులు



కథలాపూర్: మండలంలోని దూలూర్ నుంచి బొమ్మెన గ్రామానికి వెళ్లే రోడ్డులో దూలూర్ శివారులో రోడ్డుపై గొయ్యి ప్రమాదకరంగా మారింది. బైక్‌లపై వెళ్లేవారు ఆ గొయ్యిని గమనించకపోతే ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. అధికారులు గొయ్యిని పూడ్చివేయించి యథావిధిగా తారురోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: లక్ష్మీకాంత్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, కథలాపూర్ క్లస్టర్, సెల్ నంబర్: 7702537843

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

అడుగంటిన భూగర్భజలాలు

- సాగునీరందక రైతులకు ఇబ్బందులు
- ఉపకాల్వకు నీటిని విడుదల చేయాలని రైతుల వినతి



ఎండుతున్న పొలం వద్ద రైతు పూదరి లచ్చన్న

మెట్‌పల్లిరూరల్: భూగర్భజలాలు అడుగంటిపోవడంతో రైతులకు సాగు విషయంలో కష్టాలు తప్పడంలేదు. మెట్‌పల్లి మండలం చౌలమద్ది శివారులో పంట పొలాలకు నీరందక పలువురు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.ఎస్సారెస్పీ డీ–36 ఉప కాలువ కింద గ్రామానికి చెందిన 50 మందికి పైగా రైతులు సుమారు 250 ఎకరాల్లో వరి పంట వేశారు. అయితే ఈ మధ్య కొన్ని రోజుల నుంచి నీటి సమస్య ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. కాకతీయ ప్రధాన కాల్వలో నీరు ఉన్నప్పటికీ ఉపకాలువల్లోకి నీరు రావడం లేదని తద్వారా సాగుకు నీరందడంలేదంటున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే నీటిని విడుదల చేసి సాగుకు ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత శాఖ అధికారులను తెలుసుకోగా వారబందీ ప్రాతిపదికన ఉపకాల్వలకు నీరు వదులుతామని చెబుతున్నారు. ప్రస్తుతం జోన్–2కు నీరు వదిలామని, మరో రెండు రోజుల్లో జోన్–1 కు నీరు వదులుతామని దాంతో ఇక్కడి ఉపకాల్వల్లోకి నీళ్లందుతాయని స్పష్టం చేశారు.

గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరంలో గ్రామస్తులు, వైద్యులు

సారంగాపూర్: మండలంలోని నాగునూర్–లచ్చక్కపేటలో ఆదివారం జగిత్యాల పట్టణానికి చెందిన అర్జున్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నారులతో పాటు పెద్దవారికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గుండేటి అర్జున్, డాక్టర్ వంగ సృజనతో పాటు, బీజేవైఎం మండల అధ్యక్షుడు దీటి వెంకటేష్, నాయకులు రమణారావు, రవీందర్‌రావు, తిరుపతి, భూమారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతివ్వాలి



పట్ట భద్రులను ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

కోరుట్ల రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బల పరుస్తున్న అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని యూసుఫ్‌నగర్‌లో ఆదివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పట్టభద్రుల ఇంటికి వెళ్లి బీజేపీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు భూమానందం, నాగరాజు, తుక్కయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా బీజేపీ నాయకుల ప్రచారం

ఇబ్రహీంపట్నం: పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా మండల బీజేపీ నాయకులు ఆదివారం ప్రచారం చేశారు. టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యకు ఓటర్లు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు లింగారెడ్డి, నాయకులు రణధీర్, రాజారెడ్డి, నరేందర్, సతీశ్, మహేందర్ పాల్గొన్నారు.

ఢిల్లీ రైల్వేస్టేషన్ మృతులకు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: ఢిల్లీ రైల్వేస్టేషన్ తొక్కిసలాట మృతులకు భారత్ సురక్షా సమితి నాయకులు నివాళి అర్పించారు. ప్రయాగ్‌రాజ్ వెళ్లే రైలులో ఎక్కేందుకు ఒక్కసారిగా ప్రయాణికులు దూసుకురావడంతో శనివారం అర్ధరాత్రి ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో భారీ తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో మృతులకు ఆదివారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలో కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు నాయకులు పుప్పాల సత్యనారాయణ, అక్కినపెల్లి కాశీనాథం, సింగం గంగాధర్ బాశెట్టి ప్రభాకర్, వేముల పోచమల్లు, మల్లికార్జున్, కొత్తకొండ బాలన్న తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ లయన్స్ క్లబ్ కు అవార్డు



కుంభమేళా విశిష్టతను ప్రదర్శిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

రాయికల్: మంచిర్యాల జిల్లా జన్నారంలో ఆదివారం జరిగిన లయన్స్ క్లబ్ రీజియన్ మీట్ కార్యక్రమంలో బ్యానర్ ప్రెజెంటేషన్‌లో భాగంగా కుంభమేళా విశిష్టతను ప్రదర్శించిన రాయికల్ లయన్స్ క్లబ్‌కు ఉత్తమ బ్యానర్ ప్రెజెంటేషన్ అవార్డును రీజియన్ చైర్ పర్సన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి చేతుల మీదుగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్ అందుకున్నారు. ఉత్తమ కార్యదర్శి, కోశాధికారిగా కడకుంట్ల నరేశ్,కట్ల నర్సయ్య, ఉత్తమ లయన్ దంపతులుగా మ్యాకల అనురాధ రమేష్ అవార్డులను అందుకున్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లయన్ మోర హన్మాండ్లు, లయన్స్ క్లబ్ సభ్యులు దాసరి గంగాధర్,కొమ్ముల ఆదిరెడ్డి, వాసం ప్రసాద్,బొమ్మకంటి నవీన్,గంట్యాల ప్రవీణ్,కొత్తపెల్లి రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వృద్ధురాలు మృతి

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి గ్రామానికి చెందిన గడ్డమీది గంగు(72) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తక్కళ్లపెల్లి గ్రామానికి చెందిన గంగు శనివారం సాయంత్రం వంటగ్యాస్ సిలిండర్‌పై టీ చేస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పంటుకుని తీవ్రగాయాలు కాగా, స్థానికులు గమనించి చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. మృతురాలి కుమారుడు గంగనర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

ఘనంగా మలికార్జున స్వామి జాతర



జాతరలో శివ సత్తుల పూనకాలు, ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాలు

కోరుట్ల: పట్టణంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్వామివారికి పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారుల డోలు వాయిద్యాలు, శివ సత్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

సహస్ర లింగాల ఆలయంలో చతుర్థి వేడుకలు



గణనాథుడికి అభిషేకం చేస్తున్న భక్తులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులోని సహస్ర లింగాల ఆలయంలో అదివారం ఘనంగా సంకట చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పలు పుష్పాలతో అలంకరించి భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నలుమాసు గంగాధర్, ఆలయ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్, నాయకులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావు పేట శివారులోని వరదకాల్వ పంప్‌హౌజ్ వద్ద బీఆర్ఎస్ అధినేత,మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు ఆదివారం ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ పాల్గొని మాట్లాడారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన కేసీఆర్‌ని ప్రజలు ఎన్నటికీ మర్చిపోరన్నారు. ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు సంక్షేమం అందించాడని రానున్న రోజుల్లో అన్ని ఎన్నికల్లో మరలా బీఆర్ఎస్‌నే ప్రజలు ఆదరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు



దావన్‌పెల్లిలో పూజలు చేస్తున్న గిరిజనులు

రాయికల్: మండలంలోని దావన్‌పెల్లిలో ఆదివారం భోగ్ బండారు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగాసంత్ సేవాలాల్ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ బంజారాల ఐదో ధర్మ గురువని బంజారా సంస్కృతీ వేషధారణ జీవన విధానాలతో పాటు యావత్ బంజారా జాతిని ఏకాదటికి తీసుకువచ్చిన మహనీయులని పేర్కొన్నారు, కార్యక్రమంలో పూజారి బానోత్ హంజారియా, కిషన్ నాయక్, భీక్యా నాయక్ గ్రామ సేవాలాల్ ట్రస్ట్ సభ్యులు బాణావత్ తిరుపతి నాయక్, హపావత్ గంగాధర్, రాజు, అంబాజీ, తిరుమల్, బలరాం, మాజీ సర్పంచ్ మల్లయ్య, వెంకటేష్, దేవేందర్, తిరుపతి కొమురయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

నృసింహుడిని దర్శించుకున్న ఐఏఎస్ రవి



స్వామివారి చిత్రపటం బహుకరిస్తున్న ఆలయ అధికారులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శి గుగులోతు రవి కుటుంబ సమేతంగా స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వాస్వాగతం పలికి వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ అలువాలు శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, చిత్ర పటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆలయ అర్చకులు నంబి శ్రీనివాస్, సిబ్బంది తదితరులున్నారు.

కొండగట్టులో పూజలు

జగిత్యాలరూరల్: కొండగట్టు అంజన్నను ఐఏఎస్ రవి ఆదివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ పర్యవేక్షకులు గుండి హరిహరనాథ్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, ముఖ్య అర్చకులు అనిల్, అభిలాష్, సీనియర్ అసిస్టెంట్ ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

కోరుట్ల: ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సోమవారం మెట్‌పల్లి మండలం ఆరెపేట శివాయంలో ఉదయం 9 గంటలకు కేసీఆర్ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తారు. కోరుట్ల మండలం పైడిమడుగులో బీడీ కార్మికులు ఏర్పాటు చేసిన కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొంటారు.కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్యాల: మండలం పోతారం సబ్‌స్టేషన్ పరిధిలోని పోతారం, రాజారం గ్రామాల్లోని ఫీడర్లలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.